గాంధీనగర్‌కు కొత్త ఎస్‌ఐలు

బన్సీలాల్‌పేట్: గాంధీనగర్ పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వచ్చిన ఇద్దరు ఎస్‌ఐలు బాధ్యతలు స్వీకరించారు. మేఘల్‌పురాలో పని చేసిన నహీం ఖాన్, బండ్లగూడ నుంచి హరీష్‌కుమార్ బదిలీపై గాంధీనగర్‌కు వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఎస్.ఐ కావ్య సీటీసీకి, ఎస్.ఐ జీవన్‌రెడ్డి టీఎస్‌న్యాప్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా హరీష్‌కుమార్, నహీంఖాన్ మాట్లాడుతూ.. శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకుంటామన్నారు.

ఘనంగా గణపతి దేవాలయ ద్వి దశాబ్ది ఉత్సవాలు

రాంగోపాల్‌పేట్: చరిత్రాత్మకమైన సికింద్రాబాద్ గణపతి దేవాలయంలో ద్విశాతాబ్ది ఉత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. దేవాలయం స్థాపించి రెండు వందల సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా దేవాలయ చైర్మన్ ఓడెల సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ముందుగా స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, గణపతి హోమం పూజలు నిర్వహించారు. అనంతరం 200 ఏళ్ల శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. సత్యనారాయణ మాట్లాడుతూ.. గణపతి దేవాలయానికి ఎంతో ప్రాచీన చరిత్ర ఉందని, స్వామివారికి పూజలు చేస్తే సకల కోరికలు సిద్ధిస్తాయని భక్తులకు ప్రగాఢ నమ్మకం అన్నారు. అందుకే 200 ఏళ్లలో దేవాలయం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. ఈవో వినోద్ కుమార్, హన్మంతరావు, మోహన్, సదానంద్‌గౌడ్, వినోద్ కుమార్, మాధవి, శ్రీశైలం పాల్గొన్నారు.



భల్లేభల్లే.. భలేభలే!





జెక్‌కాలనీలోని ఆల్ గ్రీన్ ఫీల్డ్ ప్లే స్కూల్ డే కేర్ వార్షిక వేడుకలు ఘనంగా జరిగాయి. చిట్టిపొట్టి చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఒకరికి తగ్గట్టు మరొకరు ఆటపాటలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా ఆల్ గ్రీన్ ఫీల్డ్ స్కూల్ చైర్మన్ శైలజ మాట్లాడుతూ.. దేశ భవిష్యత్‌కు పిల్లలే పునాదులని సంస్కారవంతమైన చదువు చాలా గొప్పదన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు చేసిన వివిధ నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో అసోసియేట్ డైరెక్టర్ విజయలక్ష్మి, ప్రిన్సిపాల్ సుమతి, కో–ఆర్డినేటర్ రంజిత, అడ్మిన్ కో–ఆర్డినేటర్ నీలిమ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సాయి పాల్గొన్నారు.

–సనత్‌నగర్

సీపీఎస్ అమలుకు వినతి

ఉస్మానియా యూనివర్సిటీ: కాంట్రీబ్యూటరీ పెన్షన్ విధానాన్ని (సీపీఎస్) ఓయూ అధ్యాపకులకు అమలు చేయాలని సోమవారం రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటేశంకు ఓయూ అధ్యాపకులు వినతిపత్రం సమర్పించారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో పాటు ఇతర వర్సిటీల అధ్యాపకులకు సీపీఎస్‌ను అమలు చేస్తున్నారని ఓయూలో కూడా అమలు చేయాలని కోరినట్లు ప్రొ.శంకర్ పేర్కొన్నారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.11, నల్లవంకాయ 28, పొడుగు వంకాయ 28, బెండకాయ 45, పచ్చిమిర్చి 65, బజ్జీమిర్చి 45, క్యాప్సికమ్ 60, పచ్చకాకర 45, పందిరి బీర 35, క్యాబేజీ 25, క్యారెట్ 28, దొండ 28, గుండుబీన్స్ 55, గింజ చిక్కుడు 60, గోకరకాయ 40, కీర 23, దోసకా య 20, బీట్‌రూట్ 23, ఉల్లిగడ్డ 20, ఆలుగడ్డ 25, చామగడ్డ 50, మొరంగడ్డ 15.

సీతాఫల్‌మండి రిజర్వాయర్‌కు మరమ్మతులు

కొత్త రిజర్వాయర్ కోసం నిధులు ఇస్తామన్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి జలమండలి కార్యాలయం ప్రాంగణంలోని రిజర్వాయర్ క్రమేణా శిథిలావస్థకు చేరుతుంది. పిల్లర్లు పగుళ్లు పారడం, రిజర్వాయర్ ట్యాంకు నుంచి పెచ్చులు ఊడుతుంది. 40 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ రిజర్వాయర్‌కు సోమవారం తాత్కాలిక మరమ్మతు పనులను సికింద్రాబాద్ ఎమ్మెల్యే టీ.పద్మారావుగౌడ్ ప్రారంభించారు. ఇందుకోసం రూ.12 లక్షలు కేటాయించారు. ఈ సందర్భంగా రిజర్వాయర్ స్థితిగతులను ఎమ్మెల్యే పద్మారావుగౌడ్‌తో పాటు జలమండలి డిప్యూటీ జీఎం వై.కృష్ణ, సెక్షన్ మేనేజర్ అన్విత్, స్థానిక కార్పొరేటర్ సామల హేమ పరిశీలించారు. రిజర్వాయర్‌ను నిర్మించి నాలుగు దశాబ్దాలు పూర్తయిన సందర్భంగా దాని స్థితి ఎలా ఉందన్న తీరుపై జేఎన్‌టీయూ సాంకేతిక నిపుణులకు లేఖలు రాశామని కొద్ది రోజుల్లో నివేదికను ఇస్తారని జలమండలి డీజీఎం వై.కృష్ణ తెలిపారు. వారి నివేదిక ఆధారంగా మరమ్మతులు చేయడమా లేనిపక్షంలో కొత్త రిజర్వాయర్‌ను నిర్మించడమో అన్ని విషయం తేలుతుందన్నారు. ఇదిలా ఉండగా కొత్త రిజర్వాయర్ నిర్మాణం చేయడం అన్ని విధాల శ్రేయస్కరమని కొత్త నిర్మాణం చేపట్టాల్సి వస్తే అందుకు అవసరమైన నిధులు మంజూరయ్యేలా ప్రత్యేక చొరవ తీసుకుంటానని ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ సూచించారు.



రిజర్వాయర్ స్థితిని అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

40 ఏళ్లుగా పోరాడుతున్నాం.. వాంబే ఇళ్లు కేటాయించండి



ఆధారాలు చూపుతున్న సంఘం సభ్యులు

హిమాయత్‌నగర్: కంటోన్మెంట్ నియోజకవర్గంలోని కృష్ణానగర్ కట్ట మైసమ్మ వాంబే ఇళ్ల కేటాయింపులో జరిగిన అవినీతి అక్రమాలపై హైదరాబాద్ కలెక్టర్‌తో విచారణ జరిపించి పేదలకు న్యాయం చేయాలని కృష్ణానగర్ కట్ట మైసమ్మ వాంబే వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. సోమవారం బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం ఇన్‌చార్జ్ అధ్యక్షుడు సుదర్శన్ మాట్లాడుతూ.. గత 40 ఏళ్లుగా స్థానికంగా గుడిసెలు వేసుకొని జీవనం కొనసాగిస్తున్న 693 మందికి అప్పటి ప్రభుత్వం ఫారం–డీ పట్టాలు మంజూరు చేసిందన్నారు. కొంతకాలం తర్వాత శాశ్వత నివాసం కోసం అప్పటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వాంబే వాల్మీకి అంబేడ్కర్ ఆవాస్ యోజన పక్కా ఇళ్లను నిర్మించేందుకు రెవెన్యూ శాఖ ద్వారా తమకు ఇచ్చిన పట్టాలను తీసుకున్నారన్నారు. వాంబే ఇళ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం 11 బ్లాక్ లను ఏర్పాటు చేసి ఇళ్ల నిర్మాణం చేపట్టిందని, కానీ ప్రభుత్వం ఇల్లు కేటాయించక ముందే కొంతమంది ఆక్రమించుకొని అక్కడ నివాసముంటున్నారని తెలిపారు. ప్రభుత్వానికి పట్టాలు ఇచ్చి అర్హులైన ఇల్లు లేని పేదవారు దాదాపు 60 కుటుంబాల వరకు ఉన్నాయని తెలిపారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జోక్యం చేసుకొని నిజమైన లబ్ధిదారులైన తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు గడ్డం ఎబెల్, ఎం.జనార్ధన్, వి.ఆర్.విజయ్‌కుమార్, రాజు, సయ్యద్ సలీం, బి.వి.వెంకట్రావు, మడుగుల జనార్ధన్ పాల్గొన్నారు.

‘దేశమంతా మోదీ వెంటే’



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న బీజేపీ నేతలు

రాంగోపాల్‌పేట్: భారత ప్రధాన మంత్రి మోదీకి దేశంలోని 140 కోట్ల మంది కుటుంబం ఉందని, దేశం మొత్తం ఆయన వెంటే ఉందని రాంగోపాల్‌పేట్ కార్పొరేటర్ చీర సుచిత్ర శ్రీకాంత్ అన్నారు. సోమవారం సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి దేవాలయం ప్రాంతంలో డివిజన్ బీజేపీ అధ్యక్షులు ఆకుల ప్రతాప్ ఆధ్వర్యంలో మోదీ పరివార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మోదీజీ మేమంతా మీ వెంటే ఉన్నామంటూ బీజేపీ కార్యకర్తలు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆనంద్ వ్యాస్, చీర సత్యనారాయణ, శ్రీనివాస్, శ్రీధర్, దయానంద్, సీకే నర్సింగ్‌రావు, శ్రీనివాస్‌యాదవ్, రేష్, నిర్మల, స్వప్న, కోమల్ తదితరులు పాల్గొన్నారు.

పార్శిగుట్టలో..

బౌద్ధనగర్: పార్శిగుట్టలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు హనుమంతు ముదిరాజ్ నేతృత్వంలో సోమవారం నిర్వహించిన మోదీ పరివార్ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాచమల్ల కృష్ణమూర్తి పాల్గొని అంబేడ్కర్, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్శిగుట్ట చౌరస్తాలో మనమంతా మోదీ కుటుంబ సభ్యులమంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బండెల సత్యనారాయణ, రాజ్‌కుమార్, విశ్వనాథ్, బిక్షపతి, నాగమణి, అశోక్, సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్లకార్డులతో ప్రదర్శన

సనత్‌నగర్: మేము సైతం మోదీ కుటుంబ సభ్యులమే అంటూ బీజేపీ నేతలు, కార్యకర్తలు సోమవారం సనత్‌నగర్‌లో ప్లకార్డులు ప్రదర్శిస్తూ ప్రధానమంత్రి నరేంద్రమోదీకి మద్దతు తెలిపారు. బీజేపీ సనత్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు కస్నూరి క్రాంతికుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో దయానంద్, ఆకుల మహేష్, లక్ష్మీనారాయణ, రజనీస్, సుమన్, అయిలయ్య, మృథుల్, మల్లికార్జున్, అశ్విని, లక్ష్మీ, భరత్, చారి, శంకర్, కుషాల్ పాల్గొన్నారు.

హైదరాబాద్ విశిష్టతల్లో హలీం అగ్రభాగం



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ విశిష్టతల్లో హలీం కూడా భాగమేనని, ప్రపంచానికి అద్భుతమైన హలీం రుచిని చూపించింది ఈ మహానగరమేనని ప్రముఖ బిర్యానీ రెస్టారెంట్ ‘ప్యారడైజ్’ సీఈఓ గౌతమ్ గుప్తా తెలిపారు. రంజాన్ నేపథ్యంలో సోమవారం సికింద్రాబాద్‌లోని ప్యారడైజ్ వేదికగా ప్యారడైజ్ హలీంను సీఈఓ గౌతమ్ గుప్తా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హలీంతో హైదరాబాద్ నగరానికి అవినాభావ సంబంధం ఉందని, ఇక్కడ లభించే హలీంకు మాత్రమే అధిక ప్రాధాన్యం ఉంటుందన్నారు. హైదరాబాద్ హలీంకు జీఐ ట్యాగ్ కూడా లభించిందని గుర్తు చేశారు. మటన్, చికెన్ వెరైటీల్లో టేక్–అవే, డైన్–ఇన్‌తో పాటు ఆన్‌లైన్ యాప్‌లలో ఆర్డర్లుగా అందుబాటులో ఉందన్నారు. నగరంలోనే మొదటి సారి సీల్డ్ ప్యాకింగ్ పద్ధతిలో హలీంను అందిస్తున్నామన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న ఏవీఎన్ రెడ్డి

లాలాపేట: విద్యారంగ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని టీచర్ ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం హైదరాబాద్ జిల్లా కార్యవర్గ సమావేశం సోమవారం తార్నాకలోని స్ఫూర్తి ఛాత్రుశక్తి భవన్‌లో జరిగింది. సంఘం జిల్లా అధ్యక్షులు తిరుపతిరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యారంగ సమస్యలపై నిత్యం ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతూ నివేదికలు అందజేస్తున్నామని ఆర్థికపరమైన ఇబ్బందులు లేనటువంటి పదోన్నతుల ప్రక్రియ, విద్యారంగ సమస్యలపై దృష్టి సారించాలని ప్రభుత్వాన్ని కోరామన్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు కానుగంటి హనుమంతారావు మాట్లాడుతూ.. కోర్టు కేసుల విషయంలో ప్రభుత్వం వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని తక్షణమే నాలుగు డీఏలను ప్రకటించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వీరేష్, రాష్ట్ర సహ అధ్యక్షులు ఉషారాణి, రాష్ట్ర మహిళా కన్వీనర్ కళావతి, రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీనారాయణ, అకాడమిక్ కో కన్వీనర్ దామోదర్, జిల్లా కోశాధికారి వీరకుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం కబ్జాకు యత్నం

తిప్పి కొట్టిన రెవెన్యూ అధికారులు

రాంగోపాల్‌పేట్: ప్రభుత్వానికి చెందిన ఎకరం స్థలాన్ని రాత్రికి రాత్రి కబ్జా చేసేందుకు యత్నించగా సికింద్రాబాద్ రెవెన్యూ అధికారులు తిప్పికొట్టారు. నల్లగుట్ట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎదురుగా ఎకరం ఖాళీ స్థలం ఉంది. దీనిపై కొన్నేళ్ల నుంచి ప్రభుత్వంతో పాటు అబ్బాస్ అండ్ బ్రదర్స్, చాంద్‌బీ మధ్య ల్యాండ్ గ్రాబింగ్ కోర్టులో కేసు నడుస్తుండగా 2011లో ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు వచ్చింది. అప్పటి నుంచి ఈ భూమిని ల్యాండ్ బ్యాంకులో ఉంచి అధికారులు తరచూ పరిశీలిస్తూ వస్తున్నారు. అయితే సదరు వ్యక్తులు దీనిపై హైకోర్టుకు వెళ్లారు. కోర్టులో కేసు నడుస్తుండగానే ఈ నెల 7న రాత్రి స్థలం చుట్టూ రేకులతో నిర్మాణాలు చేసేందుకు ఉపక్రమించారు. విషయం తెలియగానే సికింద్రాబాద్ తహసీల్దార్ పాండునాయక్, సర్వేయర్ కిరణ్ తదితర సిబ్బంది వెంటనే వెళ్లి జేసీబీతో రేకులను తొలగించారు. అనంతరం రాంగోపాల్‌పేట్ పోలీస్ స్టేషన్‌లో కబ్జాదారులపై ఫిర్యాదు చేశారు. ఈ భూమి విలువ దాదాపుగా రూ. 50 కోట్లు ఉంటుందని అధికారులు పేర్కొన్నారు.



రేకులను తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

అడ్డగుట్ట: ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను భవన నిర్మాణ కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని సీపీఐ డివిజన్ కార్యదర్శి పాకాల యాదగిరి అన్నారు. సోమవారం తుకారాంగేట్ సాయినగర్‌లోని సాయిబాబా దేవాలయం ప్రాంగణంలో భవన నిర్మాణ కార్మిక సంఘం, సీపీఐ, ఏఐటీయూసీల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలపై భవన నిర్మాణ కార్మికులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. చాలా మందికి ప్రభుత్వ పథకాలపై అవగాహన లేకపోవడంతో నష్టం జరుగుతుందన్నారు. భవన నిర్మాణ రంగంలో పనిచేసే సమయంలో కార్మికులకు ఏదైనా ప్రాణాపాయం జరిగితే ప్రభుత్వం నుంచి వచ్చే భీమా సౌకర్యం, పింఛన్లు తదితర పథకాలు ప్రభుత్వం నుంచి అనేక సంక్షేమ పథకాలకు కార్మికులకు అందుతాయని వివరించారు. ఈ నెల 17న భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నూతన కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఖాసిం, బాలరాజ్, రవి, సింగారయ్య, సాయిలు, రమేష్, రామస్వామి, వీర, బాబు, రాములు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న నాయకులు

మహిళా శక్తి అపారమైంది



మహిళలను సన్మానిస్తున్న ప్రతినిధులు



మాట్లాడుతున్న కవిత

సనత్‌నగర్: లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320డి ఆధ్వర్యంలో ‘మహిళా ఉత్సవ్’ పేరిట నిర్వహించిన వేడుకలు ఘనంగా జరిగాయి. వివిధ రంగాల్లోని విశిష్ట మహిళలను సత్కరించి వారి సాధించిన విజయాలను ఆవిష్కరించి తోటి మహిళల్లో స్ఫూర్తిని నింపారు.లయన్ డాక్టర్ పి.సీతా అధ్యక్షతన జరిగిన ఈ వేడుకలకు ముఖ్య వక్తగా హాజరైన బాలల హక్కుల కార్యకర్త పద్మశ్రీ డాక్టర్ శాంతసిన్హా మాట్లాడుతూ.. మహిళాశక్తి అపారమైందని, తగిన ప్రోత్సాహం లేక అందుకోవాల్సిన శిఖరాగ్రాలను అందుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డైరెక్టర్ లయన్ ఘట్టమనేని బాబురావు మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ దేశాభివృద్ధిలో కీలకంగా వ్యవహరిస్తున్నారన్నారు. మహిళలు తమ కుటుంబాన్ని అందంగా చక్కదిద్దుకోవడంతో పాటు సామాజ వికాసానికి తమవంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా చెస్ గ్రాండ్ మాస్టర్ పద్మశ్రీ హారిక ద్రోణవల్లి, ఎన్ఆర్ఎస్‌సీ–ఇస్రో సైంటిస్ట్ డాక్టర్ పంచాంగుల మంజుశ్రీ, సామాజిక కార్యకర్త మజ్జి శ్రీదేవి, గాయని పార్వతి దాసరిను సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ కన్వీనర్ లక్ష్మీ, మల్టీపుల్ కౌన్సిల్ సెక్రటరీ జి.శ్రీనివాస్, సెకండ్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ అమర్నాథ్‌రావు, పాల్గొన్నారు.

శాంతినగర్‌లో..

అడ్డగుట్ట: మహిళలు అన్ని రంగాల్లో తమదైన శైలిలో దూసుకుపోతున్నారని కాంగ్రెస్ సికింద్రాబాద్ డీసీసీ అధ్యక్షురాలు కవిత పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం రాష్ట్ర కాంగ్రెస్ మహిళా కార్యదర్శి షబానా బేగం ఆధ్వర్యంలో శాంతినగర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన కవిత కేక్ కట్ చేసి వేడుకను ప్రారంభించారు. రామలీల, గీత, లలిత, వెంకటలక్ష్మి, సుచరిత పాల్గొన్నారు.

ఒత్తిళ్లను అధిగమించాలి



అడ్డగుట్ట: మహిళా ఉద్యోగులు ఒత్తిడి అధిగమించి విధులు నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయవాది కవితా యాదవ్, డాక్టర్ షణ్ముక ప్రియ పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని సికింద్రాబాద్‌లోని రైల్ నిలయం ఆడిటోరియంలో దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన కవితా యాదవ్, డాక్టర్ షణ్ముక ప్రియ, డిప్యూటీ ఫైనాన్స్ మేనేజర్(సికింద్రాబాద్) మాట్లాడారు. మహిళలు ఆరోగ్య పట్ల శ్రద్ధ వహిస్తూ విధులు నిర్వహించాలని సూచించారు. మంచి పుస్తకాలు చదవడంతో పాటు సంగీతం వినడం, ఆటలు, యోగా ద్వారా ఒత్తిడి అధిగమించవచ్చని తెలిపారు. పండ్లు, ఆకు కూరలు అధికంగా తీసుకోవాలన్నారు. అనంతరం ప్రిన్సిపల్ చీఫ్ పర్సనల్ ఆఫీసర్ కిషోర్ బాబు మాట్లాడుతూ.. మహిళా ఉద్యోగుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సరోజని రెడ్డి, విజయలీల, మంజులత రావు పాల్గొన్నారు.

సివరేజీ పైపులైన్ పనులు ప్రారంభం



చిలకలగూడ: సీతాఫల్‌మండి డివిజన్ జోషి కాంపౌండ్‌లో సివరేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్ సామల హేమతో కలిసి సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ పరిధిలో తాగునీరు, సివరేజీ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించామని రూ. 35 లక్షల వ్యయంతో చేపట్టిన సివరేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి డీజీఎం కృష్ణ, సెక్షన్ మేనేజర్ అన్విత్, ఏఈ కౌషిక్, జోషి కాంపౌండ్ వెల్ఫేర్ అసోషియేషన్ అధ్యక్షుడు రాజుసుందర్, బీఆర్ఎస్ నాయకులు రామేశ్వరగౌడ్, కరాటే రాజు, బిల్డర్ నవీన్ పాల్గొన్నారు.

దేశమంతా మోదీమయం: ఈటల రాజేందర్



ర్యాలీలో పాల్గొన్న ఈటల రాజేందర్

కంటోన్మెంట్: రాష్ట్రంలో మూడు నెలల్లోనే ప్రజల మూడు మారిపోయిందని బీజేపీ సీనియర్ నేత, మల్కాజ్‌గిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. కంటోన్మెంట్ నియోజకవర్గంలో బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన భారీ బైక్ ర్యాలీని సిఖ్‌విలేలో ప్రారంభించారు. ఈటల మాట్లాడుతూ.. మూడు నెలల క్రితం రాష్ట్రంలో కాంగ్రెస్ గాలి వీచిందని, ఇప్పుడు బీజేపీ వైపు మళ్లిందన్నారు. దేశమంతా మోదీమయం అయిందన్నారు. బీజేపీ కార్యకర్తల నిరంతర కృషితో త్వరలోనే దేశంలో మూడో సారి మోదీ ప్రధాని కాబోతున్నాడని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్. శ్రీగణేశ్, మల్లికార్జున్, విజయానంద్, సతీష్, పరుశురామ్ పాల్గొన్నారు.

ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

లాలాపేట: ఎరుకల అభ్యున్నతికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని సంఘం కుర్ర రాష్ట్ర కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు లోకిని రాజు నేతృత్వంలో పలువురు సోమవారం మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా వెనుకబడి ఉన్న ఎరుకల సామాజిక వర్గం అభ్యున్నతికి ప్రత్యేక కార్పొరేషన్, ఎస్టీ కమిషన్‌ను ఏర్పాటు చేసి చైర్మన్‌గా ఎరుకల సామాజిక వర్గానికి చెందిన వారికే అవకాశం ఇవ్వాలన్నారు. వివిధ ఉద్యోగ పరీక్షలకు పోటీ పడే ఎరుకల విద్యార్థుల కోసం హైదరాబాద్ కేంద్రంగా ఏకలవ్య కోచింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్రంలో 138 పందుల సహకార సంఘాలకు ప్రభుత్వ భూములు కేటాయించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే విధాన్ని అమలు చేయాలన్నారు. మంత్రిని కలిసిన వారిలో నర్సింహా, గోపాల్, వనం రమేష్, పాతపల్లి నరసింహా,కూతాడి సురేష్, రుద్రాక్షి నరసింహ, వెంకటేశ్వర్లు ఉన్నారు.

బాలుడి అదృశ్యం

చిలకలగూడ: ఓ బాలుడు అదృశ్యమైన ఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ సబిత వివరాల ప్రకారం.. వారాసిగూడకు చెందిన కేజే జాన్ (14) స్థానిక పాఠశాలలో చదువుతున్నాడు. ఇంటి నుంచి బయటకు వెళ్లి కొన్ని రోజుల తర్వాత వచ్చేవాడు. పలు పర్యాయాలు ఇలా జరగడంతో సైదాబాద్‌లోని చిల్డ్రన్స్ హోంలో చేర్పించారు. ఈ క్రమంలో ఈనెల 6న ఇంటి నుంచి బయటకు వెళ్లిన కేజే జాన్ తిరిగి రాలేదు. సైదాబాద్ చిల్డ్రన్స్‌హోంలో వాకాబు చేయగా రాలేదని చెప్పారు. పలు ప్రాంతాల్లో గాలించిన ఫలితం లేకపోవడంతో తల్లి మమత పోలీసులకు ఫిర్యాదు చేసింది.



హెచ్‌ఎండీఏలో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు

సాక్షి, సిటీబ్యూరో: హెచ్‌ఎండీఏలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. బేగంపేట్‌లోని పైగా ప్యాలెస్‌లో నిర్వహించిన ఈ వేడుకల్లో వివిధ విభాగాలకు చెందిన మహిళా అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.హెచ్‌ఎండీఏ జాయింట్ కమిషనర్ ఆమ్రపాలీ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

